ఆదాయం ఫుల్ .. సౌకర్యాలు నిల్

- రొళ్ల లక్ష్మీనరసింహస్వామి భక్తులకు కనీస సౌకర్యాలు కరువు
- అందుబాటులో లేని స్నానపు గదులు, మరుగుదొడ్లు
- ఆలయం చుట్టూ చెత్తాచెదారం
- రెండేళ్లుగా హుండీ ఆదాయం వెల్లడించని ఆలయ కమిటీ


రొళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్త


తాగునీటి కుళాయి వద్ద అపరిశుభ్రత

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి మహిమాన్వితుడిగా వెలుగొందుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటకలోని ఎంతో మంది భక్తులు స్వామివారినే ఇంటి ఇలవేల్పుగా కొలుస్తుంటారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలతో పాటు ప్రతి శనివారం ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంటుంది. అయితే ఆలయానికి ఆదాయం బాగా ఉన్నా కనీస సౌకర్యాలను కల్పించడంలో మాత్రం ఆలయ కమిటీ విఫలమైందని భక్తులు విమర్శిస్తున్నారు.

ఆదాయం చెప్పరేం?

గత సంవత్సరంలో జరిగిన బ్రహ్మోత్సవాలతో పాటు ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా భక్తులు హుండీలలో వేసిన కానుకల ద్వారా వచ్చిన ఆదాయం వివరాలు కూడా ఆలయ కమిటీ వెల్లడించకపోవడంపై భక్తులు, స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు. వారం రోజుల క్రితం హుండీలలో వేసిన కానుకలను లెక్కింపు చేపట్టారు. పూర్తిగా లెక్కింపు కాలేదని..అలానే రూములో భద్రపరిచామని చెప్పుకుంటూ కాలయాపన చేయడంపై భక్తుల్లో భిన్నభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ గ్రామానికి చెందిన గౌడ కులస్తుడు హుండీ ద్వారా ఎంత మొత్తం వస్తుంది? ఎంత ఖర్చు అవుతుందని? వివరాలు తెలపాలని ప్రశ్నించినా ఎవరూ స్పందించలేదు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులు హుండీలకు వేసిన తాళంతో పాటు గౌడ కులస్తులకు చెందిన ఓ వ్యక్తి అదే హుండీకి మరో పక్క తాళాలు వేయడం చర్చనీయాంశమైంది. ఉత్సవాలు ప్రారంభం అయినప్పటి నుంచి ముగిసే వరకు వెచ్చించిన ఖర్చులు, మిగులు వివరాలు తెలపడానికి ఎందుకు జంకుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని భక్తులు ప్రశ్నిస్తున్నారు. గత సంవత్సరం ఉత్సవంలో కానుక రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంక్ ఖాతాలో ఎందుకు జమ చేయలేదో చెప్పాలంటున్నారు. ఇప్పటికైనా కమిటీ సభ్యులు కానుక రూపంలో వచ్చిన పూర్తి ఆదాయ వివరాలు వెల్లడించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యం ఇతరాత్ర వాటిని బాగు చేయాలని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

అపరిశుభ్రతను పట్టించుకోరా?


నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

గత నెల 12 నుంచి 21వ తేదీ వరకూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అయితే బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులకు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించడంతో ఆలయ కమిటీ సభ్యులు పూర్తిగా విఫలమైయ్యారని భక్తులు మండిపడుతున్నారు. కానుకల రూపంలో లక్షలాది రుపాయిలు ఆలయానికి ఆదాయం వస్తున్నా కూడా ఆలయ ప్రాంగణంలో మాత్రం చెత్తకుప్పలు. మరుగుదొడ్లతో పాటు స్నానపు గదులు, తాగునీటీ సౌకర్యం సరైనవి లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇది వరకే నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు పిచ్చిమొక్కలకు నిలయంగా మారాయి. కనీసం ఉత్సవ సమయంలో కూడా శుభ్రం చేయించకపోవడం దారుణమని భక్తులు వాపోతున్నారు.

స్నానపు గదులు లేకపోతే ఎలా?



లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో మౌలిక సదుపాయాలు సరిగా లేవు. కనీసం మహిళలకు స్నానపు గదులు, మరుగుదొడ్లు కూడా లేకపోవడం విచారకరం. ఆలయానికి రూ.లక్షలు ఆదాయం వస్తున్నా కూడా పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి.

– గీతమ్మ, భక్తురాలు, శిరా, కర్ణాటక రాష్ట్రం

అపరిశుభ్రత లేకుండా చూడాలి



మా ఇంటి ఇలవేల్పులుగా రొళ్లలోని లక్ష్మీనరసింహస్వామిని కొలుస్తున్నాము. అయితే స్వామివారి ఆలయం పరిసరాల చుట్టూ పక్కల అపరిశుభ్రత నెలకొంది. అపరిశుభ్రతను తొలగించి ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి. ఎంతో విశిష్టత కలిగిన ఆలయం గురించి పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైన ఆలయ కమిటీ సభ్యులు స్పందించాలి.

– మంజునాథ్, భక్తుడు, అగళి

క్లుప్తంగా

ఘనంగా మహావీర జయంతి


గోమటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

అమరాపురం: జైనుల ఆరాధ్య దైవం మహావీరని జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం కలశాలతో గ్రామ వీధుల గుండా జైనులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక జైన దేవాలయానికి చేరుకుని అక్కడ కలశాలను ఉంచి ప్రత్యేకంగా పూజలు చేశారు. అలాగే ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై కూర్చోబెట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గోమటేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆయన అనుసరించిన విధానాలను భక్తులకు వివరించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పద్మరాజ్ జైన్, అనిల్ కుమార్, చంద్రకీర్తి, వసంతప్ప తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


షేక్ అబ్దుల్ రహీంను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ షేక్ అబ్దుల్ రహీంను ఆదివారం ఘనంగా సన్మానించారు. హిందూపురం డివిజన్, పశు సంవర్ధకశాఖ ఏహెచ్ఏగా ఆయన పనిచేస్తున్నారు. అయితే పాడి పశువుల రైతు సేవ కేంద్రంలో మూగ జీవాలకు, పాడి రైతులకు అందిస్తున్న సేవలను గుర్తించిన ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్సిటీ ఆయన డాక్టరేట్ అందించింది. ఈ సందర్భంగా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నవీన్‌కుమార్, రేడియాలజీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాబాజన్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూలోకి చేరిక


పీడీఎస్‌యూలో చేరిన విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ)లోకి విద్యార్థి సంఘం నాయకులు బాబావలితో పాటు విద్యార్థులు చేరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ జాజిరెడ్డి ఆశయ సాధన కోసం పనిచేస్తూ దేశంలో అందరికీ ఉచిత విద్య కోసం పోరాటం చేస్తామన్నారు. విద్యార్థి సంఘం నాయకుడు బాబావలి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తామన్నారు. హిందూపురం డివిజన్ నుంచి పీడీఎస్‌యూ సంఘంలోకి జయచంద్ర, అజయ్, సంతోష్, నరేష్, రాజు, భగత్, హుసేన్, నందీష్, నరేష్ చేరారు. కార్యక్రమంలో అనంతపురం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఉమేష్ నాయక్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి

రొళ్ల: మాజీ సీఎం వైఎస్ జగన్‌తో పాటు వారి కుటుంబంపై సోషియల్ మీడియా వేదికగా కూటమి కార్యకర్తలచే అనుచిత వ్యాఖ్యలు చేయించడం సీఎం చంద్రబాబు అండ్ కో మానుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి హితవులు పలికారు. ఆదివారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీ సోషియల్ మీడియా కార్యకర్తలు జగన్‌తో పాటు ఆయన సతీమణి భారతి మీద ఇష్టానుసారంగా మాట్లాడాన్ని ఖండిస్తున్నామన్నారు. అలాగే రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ కూడా టీడీపీ కార్యకర్తలా వ్యవహరించడం పోలీస్ వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. జగన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. వైస్ సర్పంచ్ రవి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రంగనాథుడి గిరి ప్రదర్శన

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయ గిరి ప్రదర్శన ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చి పూజలు చేసి గిరి ప్రదర్శన నిర్వహించారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	36.0
పెనుకొండ	38 .0
మడకశిర	36.0

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

చిలమత్తూరు: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని హిందూపురం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో జరిగే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సూచించారు.

అమరాపురం: స్థానిక మడకశిర రోడ్డులోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్మృతి వనంలో సోమవారం ఉదయం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకలకు మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, మేధావులను ఆహ్వానించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

లేపాక్షిలో ర్యాలీ

లేపాక్షి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఆదినారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ విషయమై ఆదివారం వారు సమావేశమయ్యారు. అంబేడ్కర్ అభిమానులు, బహుజనులు పెద్ద ఎత్తున జై భీమ్ ర్యాలీలో పాల్గొనాలన్నారు. నంది విగ్రహం నుంచి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని గుమ్మఘట్ట గ్రామం వీఎస్ఎస్ఎన్ (వ్యవసాయ సహకారం సంఘం) అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నేత గుమ్మఘట్ట శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వీఎస్ఎస్ఎన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అధ్యక్ష స్థానం ఎన్నికల్లో గుమ్మఘట్ట శ్రీనివాస్ ఒక్కరే నామినేషన్ పత్రం దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి రాఘవేంద్ర ప్రకటించారు. ఈ సంఘంలో మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉండగా వారిలో 6 మంది కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాగా 6 మంది జేడీఎస్‌కు చెందిన వారు ఉన్నారు. అయితే జేడీఎస్ పార్టీ డైరెక్టర్లలో చీలికలు రావడంతో రెండుగా విడిపోయి ఏ ఒక్కరూ నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి సునాయాసంగా గెలుపొందారు. నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

నిరుపేద విద్యార్థి ప్రతిభ

- ఇంటర్ ఫలితాల్లో గురుకుల పాఠశాలల్లో ప్రథమ స్థానం


తల్లిదండ్రులతో దివాకర్

లేపాక్షి: మండలంలో నిరుపేద కుటుంబానికి చెందిన దివాకర్ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపాడు. మండల పరిధిలోని మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్ చదువుతున్న దివాకర్ ఇంటర్ ఫలితాల్లో 984 మార్కులు సాధించాడు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంజేపీఏపీ కళాశాలల్లోనే దివాకర్ మొదటి స్థానంలో నిలవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుందరరాజు హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో మొదటి సంవత్సరంలో 130 మంది విద్యార్థులకు గాను 108 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం ఇంటర్‌లో 125 మందికి గాను 124 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. దివాకర్ ఫస్ట్ ప్లేస్‌లో నిలబడి తమ స్కూల్‌తో పాటు గ్రామానికి పేరు ప్రతిష్టలు తెచ్చాడని కొనియాడారు. విద్యార్థి తల్లిదండ్రులు నిరుపేద కుటుంబంలో ఉన్నప్పటికీ కష్టపడి చదివి రాష్ట్రంలోనే మొదటి స్థానం సంపాదించాడన్నారు. దివాకర్ మాట్లాడుతూ తమ విజయానికి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులే కారణమని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగం సంపాదిస్తానన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


అంబేడ్కర్ విగ్రహం వద్ద దీపోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం బీజేపీ పట్టణ అధ్యక్షురాలు, కౌన్సిలర్ అంజలి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ రెడ్డి, రాష్ట్ర సంపర్కాభియాన్ కన్వీనర్ మేడికుర్తి హరి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ దేవేంద్ర, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, మహాలక్ష్మీ, భారతి, అంజనమ్మ, రూరల్ మండల అధ్యక్షుడు చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు భారీ ర్యాలీ

పెనుకొండ: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బహుజన చైతన్య వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ తెలిపారు. ఉదయం పట్టణంలోని మిట్టాంజనేయస్వామి దేవాలయం సమీపం నుంచి దళితులు, బీసీ, ఎస్టీ, మైనార్టీలు ర్యాలీలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సజావుగా ప్రవేశ పరీక్ష


రొళ్ల: పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ శ్రీధర్

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం సజావుగా జరిగింది. ఇంటర్‌లో చేరేందుకు 141 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అలాగే 5వ తరగతిలో ప్రవేశానికి 247 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశం కోసం ఆదివారం అర్హత పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ శ్రీధర్ పరీక్షలను పర్యవేక్షించారు. 196 మంది పరీక్షలకు హాజరు కాగా 16 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ మైలారప్ప తెలిపారు.

టెన్త్ టాపర్లకు సన్మానం


విద్యార్థినులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: పదో తరగతి పరీక్షల్లో తాలూకా వ్యాప్తంగా ఉత్తమ మార్కులు సాధించి విద్యార్థులను స్థానిక బ్రైట్ ఫ్యూచర్ కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో శమీ వృక్ష అభివృద్ధి సమితి, బ్రైట్ ఫ్యూచర్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. వీర్లగొంది కెంచన్న గారి సౌందర్య, యువనిక, భూమికలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో శ్రీధర్ గుప్తా, సత్య లోకేశ్, ప్రిన్సిపల్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆది ఆంధ్రుడి దీపోత్సవం

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో వెలసిన సజ్జగంట రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆది ఆంధ్రుడి అద్భుత దీపోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అశేష భక్త జన సందోహం మధ్య దీపోత్సవాన్ని మధుగిరి సజ్జప్ప జ్ఞాపకార్థం ఆలయం ఎదుట ఉన్న స్తంభంపై ఆయన వారసులు ఎక్కించారు. మోహిని అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. వేలాది మందికి అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త రమాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హాజరైన భక్తులు


దీపాన్ని వెలిగిస్తున్న దృశ్యం

టోల్ ప్లాజాలో స్థానికులకు మినహాయింపు ఇవ్వాలి

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ గ్రామ సమీపంలోని 544ఈ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాలో స్థానికులకు మినహాయింపు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. రొళ్ల మండలం హెచ్ఎం పల్లి నుంచి శివప్రసాద్ మడకశిర వైపు కారులో బయలు దేరారు. అయితే టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే సిబ్బంది సుంకం కట్టాలని డిమాండ్ చేశారు. తాము స్థానికంగా ఉంటున్నామని రోజూ టోల్‌ప్లాజా గుండా రెండు మూడు సార్లు తిరగాల్సి ఉంటుందన్నారు. ప్రతిసారి సుంకం కట్టలేమన్నారు. స్థానికులకు మినహాయింపు ఇవ్వాలని లేకపోతే మరోమార్గం ద్వారా సమీప గ్రామాల ప్రజలు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో చేసేది లేక స్థానికంగా తిరిగే వాహనాలను టోల్‌ప్లాజా సిబ్బంది సుంకం వసూలు చేయకుండా వెళ్లనిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


పీఎన్ మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

హిందూపురం: హిందూపురం సమీపంలోని కర్ణాటక గౌరీబిదనూరు తాలూకా చిక్కకురుగోడు గ్రామానికి చెందిన కార్మికుడు పీఎన్ మూర్తి కుటుంబ సభ్యులను ఆదివారం ఓపీడీఆర్ శ్రీనివాసులు, కార్మిక సంఘ నాయకులు పరామర్శించారు. మృతుడు మూర్తి తూమకుంట పారిశ్రామికవాడలోని రోల్‌వెల్ పరిశ్రమలో పనిచేస్తూ గత నెల 29న రైలు కింద పడి మృతిచెందారు. కుటుంబానికి కార్మిక సంఘం మద్దతుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రోల్‌వెల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రవి కుమార్, పారిశ్రామికవాడ ఉపాధ్యక్షుడు పి.బాబు, నాయకులు రమేష్, శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు


టాక్టర్ ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల పరిధిలోని పులమతి ఆంజనేయ స్వామి కుంటలో కోడిపల్లి పంచాయతీ విభూతిపల్లికి చెందిన కొందరు అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రెండు జేసీబీలు, 10 ట్రాక్టర్లలో కుంట నుంచి మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టిని పొలాలకు కాకుండా లేఔట్లు, గ్రామంలో గుంతలు పూడ్చుకోవడానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు , పంచాయతీ అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

సోమందేపల్లి: మండల పరిధిలోని మంచేపల్లికి చెందిన బాలిక (14) ఈ నెల 9న ఇంటిలో గొరాముల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అప్పటి నుంచి అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం బాలిక చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. అయితే పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న భయంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని చర్చిల్లోనూ మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉదయమే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఈతమట్టలను చేతపట్టి హోసన్న గీతం పాడుతూ ఆయా ప్రాంతాల్లో ర్యాలీలను నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుత్థాన పండుగ (ఈస్టర్)ను పురస్కరించుకుని ఆయన అనుభవించిన శ్రమదినాలకు గుర్తుగా 40 రోజులపాటు క్రైస్తవులంతా ఉపవాసం, దానధర్మాల్లో పాలుపంచుకుంటున్నట్లు పాస్టర్లు తెలిపారు. ఏసుక్రీస్తు జెరూసలెంలోకి ప్రవేశించిన రోజున మట్టలను అలంకరించి ఆయనకు స్వాగతం పలికారన్నారు. ఈ నేపథ్యంలోనే మట్టల ఆదివారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉపవాస దీక్షలు ఆఖరి వారానికి చేరుకోవడంతో ఈ వారం రోజులపాటు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


సోమందేపల్లిలో..


హిందూపురం: సీఎండ్ఐజీ చర్చి ఆధ్వర్యంలో ఈత మట్టలతో క్రైస్తవుల ర్యాలీ


మడకశిరలో మట్టలతో ర్యాలీ ఇలా..